
# కథ

# బిలో థర్డ్ క్లాస్

-ఎమ్మెస్రాజ్



సావిత్రిలో నూతనోత్సాహం కనిపిస్తోంది. సావిత్రితో నా వివాహం జరిగి నలభై అయిదు రోజులు కావస్తోంది. కానీ ఇంతటి ఉత్సాహాన్ని ఆమెలో నేనెప్పుడూ చూడలేదు. చకచకా పనులను పూర్తిచేసుకుంటూ చాలా యాక్టివ్‌గా వుంది. ఆమె కళ్ళల్లో వింత వెలుగు వుంది. బుగ్గల్లో నునుసిగ్గు మొగ్గలేస్తోంది.

ప్రతి ఆడపిల్లా వైవాహిక జీవితం గురించి కొన్ని కలలు కంటుందని అంటారు. సావిత్రి కూడా పెళ్ళికి ముందు తాను కన్న కలల్లో- 'భర్తవెంట సినిమా చూడాలని' అన్న కల ఒకటి కాబోలు. సావిత్రి వైఖరిని గమనిస్తుంటే తన కల ఒకటి తీరబోతోందన్న ఆనందం స్పష్టంగా అగుపిస్తోంది.

మా వివాహం జరిగి నలభై అయిదు రోజులు కావస్తున్నప్పటికీ- నేను ఇంతవరకూ సినిమాకు వెళ్ళలేదు. ఆ మాటకు వస్తే గత మూడేళ్ళలో కేవలం నాలుగే నాలుగు సినిమాలు చూసాను మోసపోయి. సినిమాలను ఒకప్పుడు తెగచూసేవాణ్ణి- చూసిన సినిమానే మళ్ళీ మళ్ళీ చూసేవాణ్ణి కూడా. అలా సినిమాలు చూడగా చూడగా రోత పుట్టేసింది. నాలో ఒక విధమైన అవగాహన పెంపొందింది. నా అవగాహనకూ సినిమాలకూ ఏ మాత్రం పొత్తు కుదరకపోవడంతో సినిమాలను చూడ్డమే మానుకున్నాను. మా వివాహం జరిగిన కొత్తలో- ఒక డొక్కు సినిమా గురించి సావిత్రి ఎంతగానో పొగిడి పొగిడి చివరకు "ఏమండీ! మనిద్దరం కలిసి ఈ సినిమాను చూసితీరాల్సిందే" అని ఆర్డరు వేసింది. నేను గతుక్కుమన్నాను. ఏదో వంకమీద ఆ గండం నుంచి తప్పించుకుని "సినిమా చూడాలని నీకంతగా ఉబలాటంగా వుంటే- తోడుగా మీ అమ్మగారిని తీసికెళ్ళు" అని అన్నాను. సావిత్రి నేను చెప్పినట్టు తన తల్లివెంట సినిమాకు వెళ్ళింది. మాది కొత్త కాపురం అని మా అత్తగారు ఇరవై రోజులపాటు మా దగ్గరే వున్నారు. ఆ తరువాత మా అత్తగారు వెళ్ళాక- మా కాపురం చూసి ముచ్చట పడదామని మా అమ్మగారు కూడా వచ్చేసారు.

మరో డొక్కు సినిమా గురించి గొప్పగా ఊరించి ఊరించి చెప్పి ఎప్పటిలాగానే చివరకు తన కోరికను విన్నవించుకుంది సావిత్రి. నేను కూడా కొత్త రకం ప్లానుతో తప్పించుకుని "మా అమ్మను తోడు తీసికెళ్ళు" అని చెప్పాను. సావిత్రి అప్పుడు కూడా నేను చెప్పినట్టుగానే మా అమ్మను వెంటబెట్టుకుని వెళ్ళింది.

మా అమ్మ కూడా అయిదు రోజుల క్రితం నాన్నగారి దగ్గరికెళ్ళింది. ఇప్పుడు ఈ అద్దె కొంపలో నేనూ సావిత్రి ఇద్దరమే వుంటున్నాం.

గతంలోని రెండు డొక్కు సినిమాల కంటే పరమ డొక్కు సినిమా గురించి- సావిత్రి గొప్పగా వర్ణించింది మొన్న. చివరకు "మనిద్దరమూ కలిసి చూద్దామండీ" అంది చివరకు. నేను సినిమాల మీద ఏర్పరచుకున్న అభిప్రాయాన్ని కూలంకషంగా చెప్పాను. "అవార్డు చిత్రాలను తప్ప మరే చిత్రాలు చూడను, అవార్డులు కూడా పైరవీ ద్వారా వస్తున్నాయని తెలిసి ఆ అవార్డు చిత్రాలను కూడా చూడ్డం మానుకున్నాను. నువ్వు గనక సినిమాకు వెళ్ళా లనుకుంటే- ఒంటరిగా వెళ్ళి రావచ్చు. అలా కుదరదంటే సినిమా హాలు దగ్గర వదలిపెట్టి సినిమా వదిలాక ఇంటికి తీసుకొస్తానని భరోసా కూడా ఇచ్చాను. కానీ సావిత్రి ససేమిరా వినలేదు. తాను పెద్దగా అందంగా లేననీ, అందం లేని దానివెంట సినిమాకు వెళ్ళడం నాకిష్టం లేక ఏవేవో సాకులు చెప్పి తప్పించుకుంటున్నాననీ- మరో రెండు మూడు నిందలు వేసి కంటతడి పెట్టింది. 'భర్తవెంట కలిసి సినిమా చూడలేని ఆడ జీవితం ఎందుకు! దండగ.. ఇంతకంటే ఆత్మహత్య చేసుకోవడమే మేలే' అంది. అనడమే కాదు. ఆత్మహత్య నిజంగానే చేసుకుంటుందనిపించింది నాకు ఆమె వాలకం చూసాక.

సావిత్రి నామీద వేసిన నిందలను పోగొట్టుకునేందుకు- సాహసించి "సినిమాకు వెళ్దాం" అన్నాను పొద్దున. చూడ బోయే సినిమా గురించి నేను బాధ పడుతుంటే సావిత్రి తెగ సంబర పడుతోంది. నిజంగా దేవుడే గనక వుండి వుంటే ప్రత్యక్షమై నీకేం కావాలి అని అడిగితే "ఈ సినిమా చూసే గండం నుంచి నన్ను కాపాడు స్వామీ! మా ఆవిడ నాతో కలిసి సినిమా చూసే వరం ఇచ్చి వుంటే- ఇంకో సినిమా చూసేట్టు వరమియ్యి" అని అడిగేవాడిని. ప్చ్! కానీ ఎక్కడి దేవుడు? పాపులను శిక్షించడానికి యమ లోకంలో తగినంత సిబ్బందీ, సమయమూ లేక, భూలోకంలో చిత్రపరిశ్రమను యముడు స్థాపించాడన్న నిజం చెబితే మాత్రం ఎవరు నమ్ముతారులెండి.



● రాజమండ్రి జెసీరెడ్స్ వారి పోటీలో రూ 50/-ల కన్సొలేషన్ బహుమతి పొందిన ఫోటో

నేను సినిమాలను చూడ్డం మానుకోవడానికి నలుగురు కారణం. ఒకరు దర్శకుడు, మరొకరు నటుడు (హీరో), మరో విలన్ నటుడు, ఇంకొకరు హీరోయిన్. ఈ నలుగుర్లో ఏ ఒక్కరు చిత్రంలో వున్నా ఆ సినిమా థియేటర్ ఛాయలకన్నా వెళ్ళను. అలాంటిది- ఈ రోజు చూడబోయే సినిమాలో ఆ నలుగురూ కలిసి పనిచేసారు. అలాంటి సినిమాకు- అదీ మొదటిసారిగా భార్యతో కలిసి వెళ్ళే పరిస్థితి ఏర్పడినందుకు నాకెంత బాధగా వుంటుందో మీరే ఊహించుకోగలరు. మీరు కూడా మేధావులేలెండి, మీకు కూడా సినిమాలంటే కాస్త విరక్తే కలిగి వుంటుం దనుకుంటున్నాను.

"ఏమండీ! టైం కావస్తోంది.. నేను రెడీ! మీరు కూడా తయారవ్వండి" అంది సావిత్రి నా ముందుకు వచ్చి- కుచ్చిళ్ళను సవరించుకుంటూ. చిలకపచ్చని రంగు చీరలో సావిత్రి నాకు ఎంతో అందంగా అగుపించింది. 'నాకు మరీ ఇంత అందమైన భార్య వుందా' అనిపించింది. నలభై అయిదు రోజులుగా ఈమెతో 'గడిపానా' అని ఆశ్చర్యమే కాదు- ఇప్పటికిప్పుడే "గడపాలనే" కోరిక కూడా జనించింది. నా కళ్ళల్లోని భావాన్ని సావిత్రి బాగానే గమనిం

ఏంది. "మీకో దండం మహారాజా! ఈ పూటకు వదలి పెట్టండి.. నేను మళ్ళీ ఇంతగా ముస్తాబు కాలేను.. పైగా మ్యాట్నీకి టైం కావస్తోంది" అంటూ వాలా వాలా దుర్భారంగా జరిగింది. నేను ఆమె కోరికను మన్నించి నా కోరికను సాయంకాలానికి వాయిదా వేసుకుని బట్టలు వేసుకుని, స్కూటర్‌ను బయటికి తీసాను.

సావిత్రి తలుపులకు తాళం బిగించి- అంబారినలంకరించిన గజరాజుపై కూర్చున్నంత సంబరంతో స్కూటర్ మీద కూర్చుంది. నేను స్కూటర్‌ను ముందుకు పోనిచ్చాను. కొంత దూరం వెళ్ళగా- ప్రాణ స్నేహితుడొకడు ఎదురుపడ్డాడు. గత నాలుగు నెలలుగా మేమిద్దరమూ కలుసుకోలేదు కూడా. మా పెళ్ళికి కూడా వాడూ అనివార్య కారణాలవల్ల రాలేకపోయాడు.

నేను స్కూటర్ ఆపి- వాడికి మా ఆవిడనూ, మా ఆవిడకు వాడినీ పరిచయం చేసి, కుశల ప్రశ్నలు వేసాను. వాడు కూడా కుశల ప్రశ్నలకు తీపి సమాధానాలిచ్చి అతనీ ఊరికి ఏం పనిమీదొచ్చాడో చెప్పాక- "రండి! టీ తాగుదాం" అని ఎదురుగా వున్న హోటల్లోకి దారి తీసాడు. సినిమా స్టార్టు కావడానికి ఇంకా పదిహేడు నిమిషాల టైముంది కదా అని సావిత్రితో పాటు హోటల్లోకి వెళ్ళాను. "వద్దు వద్దు" అంటున్నా, కొత్త జంట అన్న అభిమానంతో స్వీట్స్‌కు ఆర్డరిచ్చాడు మిత్రుడు.

స్వీట్సును తింటుండగా "ఏమండీ! అనంతరావుగారూ, వారి శ్రీమతీ కూడా సినిమాకు వెళ్తున్నట్టున్నారు" అంది మా శ్రీమతి- సంతోషంగా. నేను వీథిలోకి చూసాను. నిజమే. అనంతరావుగారూ ఆయన అర్థాంగీ శ్యామలాదేవీ బుల్లెట్‌పై వెళ్ళడం అగుపించింది. శ్యామలాదేవి కట్టుకున్న చీరనుబట్టీ, ఆ సమయాన్నిబట్టీ, ఆ వీథినిబట్టీ మ్యాట్నీకి వెళుతున్నారనే అనుకున్నాను. కానీ వాళ్ళు సినిమాకు వెడితే సావిత్రికి ఎందుకు సంతోషం కలిగిందో అర్థమై చావలేదు. బహుశా అనంతరావుగారిలా నేనూ నా శ్రీమతిని వెంటబెట్టుకుని సినిమాకు వెళ్తున్నాన్లే అన్న సంతోషమే అయ్యుంటుందనిపించింది చివరకు.

పది నిముషాల్లో ఇరవై నాలుగు రూపాయిల బిల్లుని చెల్లించాడు మా మిత్రుడు. మిత్రుడితో సెలవు తీసుకొని అయిదు నిముషాల్లో థియేటరు దగ్గరకు చేరుకున్నాను. సావిత్రిని వరండాలో నిలబెట్టి- అయిదు రూపాయిల కౌంటర్ దగ్గరకు వెళ్ళి రెండు టిక్కెట్లు కొన్నాను. సావిత్రిని వెంటబెట్టుకుని ఐదు రూపాయిల గేటు దగ్గరగా నడుస్తూ సావిత్రిని గమనించాను. ఆమెలో ఇంతకు ముందున్న ఉత్సాహం మచ్చుకైనా అగుపించలేదు. పైగా మొహమంతా అలుకుపిడచలా ముద్ద కట్టుకునిపోయినట్టు అగుపించింది. ఎందుకిలా మారిపోయింది అప్పుడే! అంతలోనే ఏం జరిగింది? మా స్నేహితుడు హోటల్లో సావిత్రిని అసభ్యంగా అయితే చూడలేదు కదా!

థియేటర్లోకి వెళ్ళాక "అదోలా వున్నావేం? ఏం జరిగింది?" అని అడిగాను సావిత్రిని. సావిత్రి మరింత బిగుసుకుపోయి కూర్చుంది. చెత్త సినిమాకు వచ్చానన్న బాధ ఒకవైపు నన్ను పీడిస్తుంటే- మరోవంక సావిత్రి నన్ను బాధించడమేమిటి నాన్సెన్స్! లేక లేక మొదటిసారిగా భర్తతో కలిసి సినిమాకు వచ్చానన్న ఆనందాన్ని సావిత్రికి నేనైతే దూరం చేయలేదు కదా! ఆమె అలకకు కారణం తెలుసుకోకుండగా నేను ఎక్కువసేపు వుండలేను మరి. అందుకే మళ్ళీ అడిగాను "ఏం జరిగిందసలు?" అని.

## కన్నీటి నదులై...

ఎయిర్ కండీషనర్ గది గోడల మధ్య
నీ ప్రతిభకు కట్టిన 'విలువ'
వలువలు విప్పుకుంటుంది ...
ఆఖరి క్వశ్చన్ మార్క్ ముందు
'అందం' ప్రశ్నయి నిందిస్తున్నప్పుడు
జవాబు లేక నీ మేధాశక్తి తలొంచుకుంటుంది...
నువ్వు కట్టుకున్న ఆశల గాలి మేడలు
కూలిన పేకముక్కలవుతాయి...
నీ పేదరికాన్ని బయటికి తోస్తూ.
వచ్చినోళ్ళను స్వాగతం పలుకుతుందా గది...
నీ వెనుకే మూసుకుపోయిన స్ప్రింగ్ డోర్ మధ్య
నీ ప్రతిభ సమాధి అవుతుంది...
కాలం నీ కంట్లో కరిగిపోయిన
కన్నీరు అవుతుంది...
ఆశయాల గంజి తాగుతూ ... సిద్ధాంతాల గాలిపీల్చే
బతుకు భారమవుతుంది ...
నువ్వప్పుడు -

అమ్మ మెడలో బంగారు బంధాన్ని తెగనమ్మి
ఆశల పసుపుతాడుతో ఆమెను ఓదార్చుతావు...
అందమైన ఆత్మవంచన రేటు పెట్టి
స్వార్థం మార్కెట్టులో
ఒక ఉద్యోగాన్ని కొనుక్కుంటావ్...

** ** ** **

దేశం సు'భిక్షం'గానే వుంటుంది...
'కన్నీటి నదులై నిరుద్యోగ జీవితాలు
ప్రవహిస్తోనే వుంటాయ్...!

— "మహర్షి"

● రాజమండ్రి జేసీరెడ్స్ వారి పోటీలో రూ 50/-ల కన్సోలేషన్ బహుమతి పొందిన కవిత

"బాల్కనీ టికెట్టు ఆరు రూపాయలే కదా! ఒక రూపాయి పోతే పోయింది. బాల్కనీ టికెట్లే తీసుకోకూడదా?" అని అంది.

అయిదు రూపాయిల టికెట్టును కొన్న నాకు ఒక రూపాయి ఎక్కువ పెట్టి బాల్కనీ టికెట్టును కొనడం కష్టమైన పనేమీ కాదు. నా స్థాయికి తగ్గవాళ్ళు అందరూ నాలుగు రూపాయిల టిక్కెట్లనే కొంటారు. కొత్తగా భార్యతో వచ్చానని అయిదు రూపాయిల టిక్కెట్లను కొన్నాను. బాల్కనీకి టిక్కెట్లు కొననందుకు సావిత్రి చిన్నబుచ్చుకుంటుందనుకోలేదు. అయినా పిచ్చి కాకపోతే మరేమిటి? కావాల్సింది సినిమా చూడ్డం! ఏ క్లాసులో కూర్చుని చూస్తే మాత్రం ఏమిటి! హోదా ఒకటి అడ్డు వస్తుంది కాబోలు! అలాగని రెండు రూపాయిల టిక్కెట్టును నాలుగు రూపాయిల టిక్కెట్టును కొనలేదే!

'క్లాసు'ల గురించి సావిత్రికి 'క్లాసు' తీసుకున్నాను. నేను పాఠం మొదలుపెట్టబోతుండగానే, నే చెప్పబోయే పాఠం పూర్తిగా అర్థమైపోయినట్టు "మీకేమీ తెలియదండీ! మొన్న మీ అమ్మగారితో ఈ టాకీసుకే- ఈ క్లాసుకే వచ్చాను. కానీ అదే రోజు సినిమాకు వచ్చిన ఎదురింటి శ్యామలాదేవి నాతో ఏమందో తెలుసా? యూడీసీ భార్యవై వుండీ ఆ క్లాసుకు వెళ్ళడమేమిటి?" అని చీదరించుకుందండీ! అక్కడికీ నేను 'బాల్కనీకి టికెట్టు దొరకలేదండీ' అని చెప్పాను. అప్పుడామె ఏమందో తెలుసా? 'బ్లాకులో కొనాల్సివుంటివి.. డబ్బు తక్కువపడితే నేనిచ్చేదాన్ని- ఒకవేళ అలా ఇష్టపడకపోతే తిరిగి ఊరికే ఇంటికి రావాల్సి వుంటివి" అని అందండీ! ఈ రోజు కూడా ఆమె తన భర్తతో సినిమాకు వచ్చింది. ఆమె ముందు నేను ఇక తలకాయనెలా ఎత్తుకొని తిరగ్గలను?" అని బాధ పడింది.

హో.. అని నిట్టూర్చాను. విషయం నచ్చచెప్పి ఓదార్చుదామనుకునేంతలో- సినిమా మొదలైంది. నా ఓదార్పు పక్క ప్రేక్షకులకు డిస్ట్రబెన్స్‌ను కలిగిస్తుందని- ఇంటికి వెళ్ళాక నచ్చచెబుదామనుకున్నాను. నేను ముందుగా అనుకున్నట్టుగా- చెవుల్లో దూదిని కుక్కుకుని- కళ్ళను గట్టిగా మూసుకుని కుర్చీలో చేరగిలపడ్డాను. అప్పుడప్పుడూ కళ్ళు మాత్రం కాస్త తెరచి, సావిత్రిని గమనించాను. ఆమె కూడా సినిమాను అయిష్టంగా చూస్తోంది. మొహంలో మునుపటి కళ లేదు. ఏదో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతూనే వుంది.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి. ఆ లైట్లు వెలిగిన మరుక్షణంలోనే- సావిత్రిలో మునుపటి 'కళ' వచ్చేసింది. థియేటర్లోని బల్బులకు సావిత్రికి ఎలాంటి సంబంధం వుందో అర్థం కాలేదు. ఆ విషయం కూడా ఇంటికి వెళ్ళాకే కనుక్కుందామనుకున్నాను.

తరువాత సినిమా కూడా మొదలైంది. త్వరగానే వదిలిపెట్టారు కూడా. శ్యామలాదేవి కంట్లో పడకూడదన్న ఆలోచనతో సావిత్రి నేర్పుగా థియేటరు బయటపడింది. నేను స్కూటరు స్టార్టు చేస్తుండగా- "ఏయ్! వాణీ!" అని పిలిచింది సావిత్రి. వాణిశ్రీ మా పక్కింటావిడ. ఆమె భర్త మా ఆఫీసులోనే ఎల్డీసీగా పని చేస్తుంటాడు.

"ఏమిటే? ఎల్డీసి భార్యవై వుండీ నాలుగు రూపాయిల క్లాసుకు వెళ్ళడమేమిటి?" అని హీనంగా అడిగింది సావిత్రి. "బాల్కనీ టిక్కెట్లు అయిపోయాయి నేనొచ్చేసరికి" అంది వాణిశ్రీ దీనంగా. "అయిపోతే మాత్రం- ఊరికే ఇంటికి తిరిగి వెళ్ళాల్సింది. సినిమాను ఈ రోజు కాకపోతే రేపు చూసేదానివి. మన ఆడవాళ్ళవల్ల భర్తల గౌరవాలు పోకూడదు. ఫలానా ఎల్డీసీ పెళ్ళాం ఫలానా లోక్లాసుకు వెళ్ళిందంటే మీ ఆయనకే కదా అవమానం" అంది ఎంతో గర్వంగా- పాపం వాణిశ్రీ మొహం అదోలా మాడ్చుకుని మౌనంగా వెళ్ళిపోయింది. 'మనిషి ఏ క్లాసుకు చెందితేనేమి? ఆలోచనలు ఫస్టు క్లాసుకు చెందినవై వుండాలి..' అనుకుని స్కూటర్‌ను స్టార్టు చేసాను. [illegible] స్కూటర్‌మీద బిలో థర్డు క్లాసుకు చెందిన మ[illegible] కూర్చున్నట్లుగా అనిపించింది- సావిత్రిని చూసాక. ➧